సాక్షి

రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 15 । మార్చి । 2024



అభిషేక ప్రియుడికి వందనం

వేములవాడ: రాజన్నను గురువారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి 110 అభిషేకాలు పూర్తి చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:31	శని 5:02

గరిష్టం/కనిష్టం 37.0/24.0

వాతావరణం

ఎండగా ఉంటుంది. తీవ్ర ఉక్కపోత ఉంటుంది. గాలిలో మోస్తరు తేమ ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సిరిసిల్ల: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'జర్నీ టు స్పేస్' పేరిట జిల్లాలోని కేజీబీవీలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. సంస్థ డైరెక్టర్ రఘునందన్‌కుమార్ మాట్లాడుతూ చంద్రయాన్–3, ఆదిత్య ఎల్–1, గగన్‌యాన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇస్రో ఆధ్వర్యంలో చేపట్టనున్న 'యువిక–2024' పోటీలపై జిల్లా నుంచి విద్యార్థులు అర్హత సాధించాలని కోరారు. అదనపు కలెక్టర్ పి.గౌతమి, డీఈవో రమేశ్‌కుమార్, జీసీడీవో పద్మజ, డీఎస్‌వో దేవయ్య పాల్గొన్నారు.

సంఘం స్థలాన్ని అప్పగించండి



ముస్తాబాద్(సిరిసిల్ల): సంఘం స్థలాన్ని అప్పగించాలని కోరుతూ మండల కేంద్రంలో గురువారం ముదిరాజ్ కులస్తులు రాస్తారోకో చేపట్టారు. ముదిరాజ్ సంఘం బాధ్యులు రాజలింగం, గజ్జెల రాజు మాట్లాడారు. ముదిరాజ్ సామాజికవర్గానికి ప్రభుత్వం యాభై ఏళ్ల క్రితం సర్వే నంబర్ 984లో 13.39 ఎకరాలను ఇచ్చిందని తెలిపారు. కొన్నాళ్ల క్రితం తమ సంఘంలోని పెద్ద మనుషుల పేరిట పట్టాలు తీసుకున్నామని, ఇప్పుడు ఆ భూమి తమదేనని ఆ పెద్ద మనుషులు అంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలోనే తమ సంఘానికి సంబంధించిన ముగ్గురిపై పోలీసులు కేసులు పెట్టారని, వాటిని ఎత్తివేయాలని కోరారు. ముదిరాజ్ సంఘానికి కేటాయించిన స్థలంలో పట్టాలు రద్దు చేసి, సంఘానికి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

'సంక్షోభానికి గత సర్కారే కారణం'



సిరిసిల్లటౌన్: వస్త్రపరిశ్రమలో సంక్షోభానికి గత సర్కారు కారణమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పది రోజులుగా సిరిసిల్లలో రిలే దీక్షలు చేస్తున్న ఆసాముల శిబిరాన్ని గురువారం సందర్శించి మాట్లాడారు. గత సర్కారు ఆర్డర్లు ఇచ్చి వస్త్రాన్ని సేకరించిందన్నారు. బిల్లులు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిందని విమర్శించారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభం నుంచి గట్టెక్కడానికి కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు కార్మికులందరికీ అంత్యోదయ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత కార్పొరేట్ వైద్యం, వస్త్ర పరిశ్రమకు యాభైశాతం కరెంటు సబ్సిడీ అందించిందని వివరించారు. ఇప్పుడు కూడా సిరిసిల్ల ఆసాములు, కార్మికులు, యజమానులు కష్టాల్లో ఉన్నారని వారి సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ తదితరులున్నారు. దీక్షల్లో సిరిసిల్ల రవీందర్, చేర్యాల అశోక్, మండల రాజు, పోరండ్ల శ్రీను, కమలాకర్ తదితరులున్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు



చందుర్తి(వేములవాడ): కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అన్యాయం జరుగుతోందని సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు అక్రమ కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య పేర్కొన్నారు. లింగంపేట ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావుపై అక్రమంగా కేసు నమోదు చేశారంటూ గురువారం చందుర్తి పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లుడుతూ అధికార పార్టీ నాయకులు ఎన్ని కేసులు పెట్టిన ఎదుర్కొంటామన్నారు. వైస్ ఎంపీపీ అబ్రహం, నాయకులు బత్తుల కమలాకర్, చిలుక పెంటయ్య, దప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, తిప్పని శ్రీనివాస్, ఈర్లపెల్లి రాజు, పర్శరాములు, రమేశ్, సత్తయ్య ఉన్నారు.



పరీక్షహాల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



స్నేహితుల ఫోన్ నంబర్లు తీసుకుంటూ..



మిత్రులకు బై..బై చెబుతూ..



ఇంటిబాటలో చలో..చలో

తీపి గుర్తులతో ఇంటికి..

ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగియడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు గురువారం ఇంటిబాట పట్టారు. ఇన్నాళ్లు పరీక్షల కోసం పుస్తకాలతో కుస్తీపడిన విద్యార్థులు వేసవి సెలవుల కోసం ఇంటికి ప్రయాణమయ్యారు. స్నేహితుల ఫోన్‌నంబర్లు, చిరునామాలు తీసుకోవడం కనిపించింది. విద్యార్థుల రాకతో సిరిసిల్ల బస్టాండ్‌లో రద్దీ పెరిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

'జీరోబిల్లు' మిస్ మ్యాచ్!



ప్రజాపాలన దరఖాస్తును చూపుతున్న ఈమె అంకం లక్ష్మి. సిరిసిల్ల పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన లక్ష్మి ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు చేశారు. ఇంటికొచ్చిన 'సెస్' సిబ్బందికి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, రేషన్‌కార్డు నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్ ఇచ్చారు. 'సెస్' సిబ్బంది మొన్న వచ్చి కరెంట్ బిల్లు కొట్టడంతో రూ.679 బిల్లు వచ్చింది. అదే పక్కింటి వారికి మాత్రం జీరోబిల్లు వచ్చింది. ఇదేంటని అడిగితే మున్సిపల్ ఆఫీస్‌కు వెళ్లి మళ్లీ దరఖాస్తు చేయాలని చెప్పడంతో ఇలా వచ్చారు.



ఇతను సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌కు చెందిన ముక్తర్ పాషా. ఇతనికి విద్యుత్ సర్వీస్ నంబరు 10101 11785 ఉంది. 200 యూనిట్ల విద్యుత్ కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేశాడు. 'సెస్' అధికారులు అడిగిన వివరాలు అన్నీ ఇచ్చారు. కానీ మీటరు రీడింగ్ తీస్తే రూ.730 బిల్లు వచ్చింది. జీరోబిల్లు ఎందుకు రాలేదు అంటే.. ఏదో నంబరు తప్పు పడిందని.. మున్సిపల్ ఆఫీస్‌కు వెళ్లి.. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోండని తెలపడంతో ఇలా వచ్చారు. జిల్లాలో ఏకంగా 25 వేల మంది విద్యుత్ వినియోగదారులు జీరోబిల్లుకు దూరమయ్యారు.



కరెంట్ బిల్లు చూపిస్తున్న ఆమె ముస్తాబాద్‌కు చెందిన గాండ్ల కనకవ్వ. ప్రజాపాలన సమావేశంలో గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకుంది. అన్ని విధాలుగా ఆమె అర్హురాలు. అయినా ఈనెల కరెంట్ బిల్లు వచ్చింది.

- అధికారుల తప్పులు.. జనం తిప్పలు
- వెలగని గృహజ్యోతి.. అందని జీరోబిల్లు
- జిల్లాలో 25వేల మంది అవస్థలు
- 'సెస్' పరిధిలో అర్హుల ఆందోళన



సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్‌లో బారులు తీరిన వినియోగదారులు

సిరిసిల్ల/ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వివరాల నమోదు త్వరగా చేయాలన్న ఆతృత.. నిర్లక్ష్యం వెరసి ఆన్‌లైన్‌లో తప్పులతడుకగా ఫీడ్ చేశారు. ఫలితంగా అర్హులు సైతం జీరో బిల్లుకు దూరమయ్యారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలనడంతో మున్సిపల్, మండల పరిషత్ ఆఫీస్‌ల వద్ద గంటల తరబడి క్యూలో ఉంటున్నారు. అయినా వారి సమస్య పరిష్కారం కావడం లేదు.

ప్రత్యేక యాప్ అయినా ..

జిల్లాలో 'గృహజ్యోతి' లబ్ధిదారులను గుర్తించేందుకు కరెంట్‌బిల్లు, ఆధార్‌కార్డు నంబర్, రేషన్‌కార్డు నంబర్, ఫోన్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌తో అనుసంధానించాల్సి ఉంది. 'సెస్' క్షేత్రస్థాయి సిబ్బంది ఫిబ్రవరి 20లోగా ఈ వివరాల నమోదు పూర్తి చేశారు. 'సెస్' పరిధిలో ప్రత్యేక యాప్‌ను రూపొందించి.. 'గృహజ్యోతి' అమలుకు సన్నాహాలు చేశారు. కానీ ఆధార్ నంబర్, రేషన్ కార్డు నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్ సరిగ్గా నమోదు చేయకపోవడంతో మిస్‌మ్యాచ్ కింద జీరో విద్యుత్‌బిల్లులు రావడం లేదు.

అర్జీల నమోదులో పొరపాట్లు

ప్రజాపాలనలో అధికారులు చేసిన పొరపాట్లకు చాలా మంది అర్హులకు జీరో బిల్లులు రాలేదు. కొన్ని గ్రామాల్లో సెస్ బిల్‌కలెక్టర్లు వివరాలు నమోదు చేయడంతో తప్పుగా నమోదైనట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీల్లోనే గృహలక్ష్మి లాగిన్ ఇస్తే అన్ని గ్రామాల వారికి ఇబ్బందులు ఉండవని అర్జీదారులు పేర్కొంటున్నారు. జిల్లాలో సుమారు 80 వేల మంది వినియోగదారులకు గృహలక్ష్మి వర్తించనట్లు సమాచారం.

సవరణకు అవకాశం

గృహలక్ష్మి పథకం కోసం వచ్చిన దరఖాస్తుల్లో రిజెక్టు అయినవాటిని సవరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మండల పరిషత్ కార్యాలయాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. అర్హులై ఉండి గృహజ్యోతి వర్తించనివారు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, కరెంట్ బిల్లులను తీసుకెళ్లి.. కౌంటర్‌లలో ఉన్న ఆపరేటర్లకు అప్పగించాలి.

పేదలు 'గృహజ్యోతి'కి దూరం

అధికారులు చేసిన తప్పులతో.. అన్ని అర్హతలున్నా పేదలు జిల్లా పరిధిలో 'గృహజ్యోతి'కి దూరమవుతున్నారు. జిల్లాలోని 255 గ్రామాలతోపాటు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఇలాంటి మిస్‌మ్యాచ్ సమస్యలు ఉన్నాయి. జిల్లాలో 85 వేల మంది జీరోబిల్లుకు అర్హత సాధించినా.. ఇందులో అందరికీ బిల్లులు వర్తించడం లేదు. చాలా మందికి ఎప్పటిలాగే విద్యుత్ బిల్లులు వచ్చాయి. అద్దెకు ఉండే వారు సైతం గృహజ్యోతి వివరాలు నమోదు చేసుకున్నారు. వారు సైతం జీరోబిల్లుకు దూరమయ్యారు. వినియోగదారుల చేతికి బిల్లులు రావడంతో ఈనెలలో కట్టక తప్పని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా 'గృహజ్యోతి'లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందని వారు ఆందోళన చెందుతున్నారు.

'గృహజ్యోతి' స్వరూపం

దరఖాస్తులు	1,42,966
గృహవిద్యుత్ కనెక్షన్లు	1,64,849
తెల్లరేషన్‌కార్డుదారులు	1,73,768
200 యూనిట్లలోపు వినియోగదారులు	లక్ష
'గృహజ్యోతి' అర్హులు	85 వేలు
మిస్‌మ్యాచ్ బిల్లులు	25వేలు (అంచనా)
అర్హత సాధించాల్సిన వారు	15 వేలు

సమగ్ర వివరాలు నమోదు చేయాలి



సమగ్ర వివరాలు నమోదు చేయాలి. అన్నీ నమోదు చేస్తేనే.. జీరో బిల్లులు వస్తాయి. ఏ ఒక్కటి తప్పుగా నమోదైనా మిస్‌మ్యాచ్‌గా జీరో బిల్లు రావడం లేదు. పట్టణ పరిధిలో మున్సిపల్ ఆఫీస్‌ల్లో, పల్లెల్లో ఎంపీడీవో ఆఫీస్‌ల్లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఆ వివరాల ఆధారంగా జీరోబిల్లులు వస్తాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అర్హులకు జీరో బిల్లులు ఇస్తాం. రేషన్ కార్డు ఉండి గృహలక్ష్మి రానివారు మరోసారి అప్‌డేట్ చేసుకోవాలి.

– సూర్యచంద్రారావు, 'సెస్' ఎండీ, సిరిసిల్ల

నీళ్ల కోసం పోరాటం చేస్తా



బూర్గుపల్లి రచ్చబండలో మహిళలతో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

- వరదకాల్వకు నీళ్లు ఇవ్వడం లేదు
- మీకోసం కొట్లాడి జైలుకెళ్లాను
- కాంగ్రెస్ హామీల అమలుకు పోరాటాలు
- ప్రజాహితయాత్రలో బండి సంజయ్

బోయినపల్లి(చొప్పదండి): పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నారని, మరో రెండు రోజుల్లో ప్రజాహితయాత్ర ముగిసిన తర్వాత నీళ్ల కోసం కొట్లాడుతానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. బోయినపల్లి మండలం బూర్గుపల్లి, కోరెం, బోయినపల్లి, తడగొండ, విలాసాగర్, వెంకట్రావుపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో గురువారం ప్రజాహితయాత్ర చేపట్టారు. కోరెంలో ఎల్లమ్మ, విలాసాగర్‌లో బీరప్ప ఆలయాలను దర్శించుకున్నారు. బూర్గుపల్లిలో మున్నూరుకాపు, విలాసాగర్‌లో గౌడసంఘం కమ్యూనిటీ హాల్‌కు, నర్సింగాపూర్‌లో పలు పనులకు భూమిపూజ చేశారు. బోయినపల్లిలో ముదిరాజ్ సంఘ భవనానికి రూ.5లక్షలు మంజూరు చేశారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ యాసంగిలో రైతులు వేసిన పంటలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. వరదకాల్వకు నీళ్ల ఇవ్వడం లేదన్నారు. త్వరలో నీళ్ల కోసం పోరాటం చేస్తానని తెలిపారు. పిల్లలకు ఉద్యోగాలు కావలని కొట్లాడితే కాంగ్రెస్‌కు ఓటేశారని, ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ రైతులకు అనేక రకాల సబ్సిడీలు ఇస్తున్నారన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో ఉపాధిహామీ పనులకు రూ.167.42కోట్లు, రోడ్ల అభివృద్ధికి రూ.72.91కోట్లు, చెట్ల పెంపకానికి రూ.88.52కోట్లు వెచ్చించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎర్రం మహేశ్, అల్లాడి రమేశ్, పెరుక శ్రావణ్, బీజేపీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహాచారి, గంగిపెల్లి స్వామికుమార్, పర్శరాం, కొనుకటి హరీశ్, సుంకపాక ప్రభు, బోగోజి గంగాధర్‌చారి తదితరులు ఉన్నారు.

నీటి విడుదల చేయకుంటే ఆందోళన చేస్తాం

గంగాధర(చొప్పదండి): రెండు రోజుల్లో వరద కాల్వకు నీటిని విడుదల చేయకుంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని వెంకంపల్లి, ఉప్పరమల్యాల, గర్శకుర్తి గ్రామాల్లో గురువారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. గర్శకుర్తిలో రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులు, రూ.5లక్షలతో నిర్మించే చేనేత భవనం పనులు, రూ.2లక్షలతో నిర్మించే వేంకటేశ్వర ఆలయం మండప నిర్మాణం పనులకు బండి సంజయ్ భూమి పూజ చేశారు.

ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టరేట్ అనురాగ్ జయంతి, చిత్రంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, గౌతమి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి
- నగదు, మద్యం పంపిణీపై నిఘా ఉంచాలి

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు నిజాయితీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సమీక్షించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీపై నిఘా ఉంచాలని సూచించారు. ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం కీలకమని, సీ–విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వీడియో ఫుటేజీ తప్పనిసరి

ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు నగదు ఇతర ఆభరణాలు సీజ్ చేసేటప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజీ తీసుకోవాలని సూచించారు. అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమన్నారు. సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్ బృందాలు ఎన్నికల నేపథ్యంలో జరిగే ప్రతి రాజకీయ సభలు, ర్యాలీలను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడం, ఖర్చుపై నివేదిక తయారు చేసే విధానంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అదనపు కలెక్టర్లు ఎస్.ఖీమ్యానాయక్, పి.గౌతమి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు ఎల్.రమేశ్, రాజేశ్వర్, ఎన్నికల మాస్టర్ ట్రెయినర్ పి.మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

వేములవాడరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపార అభివృద్ధికి అందించే పలు పథకాలను మహిళలు వినియోగించుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. వేములవాడఅర్బన్ మండలం అనుపురంలో నాబార్డ్ సౌజన్యంతో స్వశక్తి మహిళా సంఘాలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో మిల్లెట్స్ తిను బండారాల తయారీ, టైయిలరింగ్‌పై అందిస్తున్న శిక్షణను అదనపు కలెక్టర్ గౌతమితో కలిసి గురువారం పరిశీలించారు. మిల్లెట్ తినుబండారాలకు మార్కెట్లో ఉన్న డిమాండ్, మార్కెటింగ్ చేయు విధానంపై చర్చించారు. అనంతరం టైయిలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళల వివరాలు, ఫ్యాషన్ డిజైన్‌లో అందిస్తున్న శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు యూనిఫాంలు, గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూల్ యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగిస్తుందని తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి పట్టణాల్లోని వస్త్ర పరిశ్రమలతో అనుసంధానం కావాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, అధికారులు పాల్గొన్నారు.

పేదల కళ్లలో ఆనందమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మరిమడ్లలో పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): పేదల కళ్లలో ఆనందం చూడడమే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట, కొండాపూర్, నిమ్మపల్లి, మరిమడ్ల, కొలనూర్, నాగారం గ్రామాల్లో గురువారం పర్యటించారు. మరిమడ్లలో సింగిల్‌విండో గోదాం, ముదిరాజ్, యాదవ సంఘ భవనాల పనులు ప్రారంభించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన కలెక్టర్ సమావేశంలో గోదాముల సంఖ్య పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎన్నికల హామీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల్లోని 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్యయాదవ్, రాంమోహన్‌రావు, వైస్ చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, కాశవేణి మహేశ్, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి, డీసీవో బుద్ధనాయుడు, డైరెక్టర్లు గొట్టె మహేశ్వరీ, మామిడి రమ, పల్లం సత్తయ్య, ముత్యాల కిషన్‌రెడ్డి, బానాపురం రంగారెడ్డి, పారెల్లి రాజు, బాల్‌రెడ్డి, నోముల భూపతిరెడ్డి, అనిల్‌కుమార్, ఆనందం, సీఈవో కేశవులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



సిరిసిల్లకల్చరల్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ ఆకాంక్షించారు. గీతానగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో కీలకమైన పదో తరగతి దశను విజయవంతంగా పూర్తి చేస్తే భవిష్యత్తు స్ఫూర్తినిస్తుందన్నారు. హెచ్‌ఎం శారద, ఎస్‌ఎంసీ మాజీ చైర్‌పర్సన్ రూపిక, రాధారాణి, టీచర్లు తిరుపతి, ప్రకాశ్‌రావు, నరేందర్ పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



సిరిసిల్ల: వినియోగదారులు తమ హక్కులు తెలుసుకొని, అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ కోరారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల వినియోగదారుల సంఘం రూపొందించిన కరపత్రాలను కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. డబ్బులు చెల్లించి వస్తువులను కొనుగోలు చేసినా, సేవలు పొందినా వారు వినియోగదారులేనన్నారు. జిల్లా వినియోగదారుల సంఘం ప్రతినిధి, అడ్వకేట్ శాంతిప్రకాశ్ శుక్లా మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, సేవల గురించి వివరించారు. సమస్యల పరిష్కారానికి జాతీయస్థాయిలో టోల్‌ఫ్రీ 1800114000 లేదా 1915, వాట్సాప్ 8800001915, రాష్ట్రస్థాయిలో 18004259339 లేదా 1967లో సంప్రదించాలని సూచించారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ ఉద్యమకారుడికి అనారోగ్యం

- పట్టించుకునేవారు కరువయ్యారని సోషల్ మీడియాలో ఆవేదన



శ్రీనివాస్‌రావును పరామర్శిస్తున్నజీవన్‌రెడ్డి

జగిత్యాల: తెలంగాణ ఉద్యమంలో జగిత్యాలకు చెందిన ఎన్నమనేని శ్రీనివాస్‌రావు చురుగ్గా పాల్గొన్నారు. పట్టణంలో జరిగిన ప్రతీ సభకు హాజరయ్యారు. జేఏసీ కన్వీనర్‌గా పని చేసిన ఆయన ఇటీవల అనారోగ్యం పాలయ్యారు. ఉద్యమం కోసం ఎంతో కష్టపడ్డానని, తనను పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన చెందుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది చూసిన పలువురు శ్రీనివాస్‌రావుకు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురువారం ఆయన ఇంటికి వెళ్లి, పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యమకారుల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి ఉందని, త్వరలోనే వారికి చేయూతనందించేందుకు విధివిధానాలు రూపొందిస్తామని పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్లు, ఐస్ క్రీం తయారీ కేంద్రాల తనిఖీ



పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: పట్టణంలోని వాటర్ ప్లాంట్లు, ఐస్ క్రీం తయారీ, విక్రయ కేంద్రాలను మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారికి జరిమానా విధించారు. వాటర్ ప్లాంట్ల యజమానులు ఐఎస్ఐ లైసెన్స్ తీసుకోవాలన్నారు. లేకపోతే తెలంగాణ పురపాలక చట్టం-2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చుతాం

- పేదలకు న్యాయం చేస్తాం
- భూమి పత్రాల పంపిణీలో అడ్లూరి



భూమి పత్రాలు పంపిణీ చేస్తున్నలక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: మండలంలోని గాదెపెల్లి శివారు ప్రభుత్వ భూమికి సంబంధించిన పత్రాలను ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం 84 మంది పేలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు న్యాయం చేయడానికి వెనకాడబోమన్నారు. 2014లో నిరుపేదలకు పట్టాలు ఇచ్చిన అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ మోఖా చూపకుండా మోసం చేశారని, తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టాలు ఇచ్చానని వెల్లడించారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే పట్టాలు ఇస్తామన్నారు. భూకబ్జాకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతోందన్నారు. ముందుగా ధర్మపురి బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కృష్ణ చైతన్య, సర్పంచులు, అధికారులు, నాయకులు తదితరులున్నారు.

నిధులు లేక నీరసం

- 19 నెలలుగా విడుదల కాని నిధులు
- భారంగా రైతువేదికల నిర్వహణ
- జిల్లాలో 57 రైతువేదికలు



నిర్వహణ లేక బండపల్లి, మల్రిగడ్డ రైతువేదికల పరిసరాల్లో పిచ్చిమొక్కలు

చందుర్తి(వేములవాడ): పంటల సాగులో వస్తున్న మార్పులపై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్మించిన రైతువేదికలు నిరుపయోగంగా మారాయి. 19 నెలలుగా నిధులు విడుదల కాక వాటి నిర్వహణ అధికారులకు భారంగా మారింది. వారంలో రెండు రోజులు ఏఈవోలు రైతులతో సమావేశమై.. సాగులో విధానాలు, పంటల్లో తీసుకోవాలిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. రైతువేదికల నిర్వహణకు ప్రభుత్వమే ప్రతీ నెల రూ.9వేలు కేటాయించింది. మొదటి ఆరు నెలలు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం తర్వాత నుంచి పట్టించుకోవడం లేదు. 2022 ఆగస్టు నుంచి నిర్వహణకు నిధులు రావడం లేదు.

లక్ష్యం గాలికి..

రైతులకు వ్యవసాయాధికారుల సేవలందించేందుకు జిల్లాలోని 57 రైతువేదికలు నిర్మించారు. ఒకప్పుడు రైతులు వ్యవసాయాధికారులను కలవాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమయభావంతోపాటు ఆర్థికభారం అన్నదాతలపై పడేది. రైతులకు ఇబ్బందులకు కలుగకుండా వ్యయ ప్రయాసాల భారం పడకుండా గత రాష్ట్ర ప్రభుత్వం పంటలసాగు సమావేశాలను ఏర్పాటు చేసుకునేందుకు రైతువేదికలను అందుబాటులోకి తెచ్చింది. కానీ నిర్వహణకు నిధులు సమకూర్చడంలో గత ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ పాలనలో 15 నెలల నిధులు విడుదల చేయలేకపోయింది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఇప్పటికీ రైతువేదికల నిర్వహణపై దృష్టి సారించలేదు.

ఏఈవోలపైనే భారం

రైతువేదికల నిర్వహణకు నెలల తరబడి నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ భారం ఏఈవోలకు తడిసి మోపెడవుతున్నట్లు తెలుస్తోంది. వేదికల వద్ద పరిశుభ్రత పనులు చేయించడం కష్టంగా మారింది. గతంలో రైతు వేదికల్లో పనిచేసే వారు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో పనులు మానేస్తున్నారు. దీంతో కొన్ని సందర్భాల్లో ఏఈవోలే చీపుర్లు పట్టుకొని శుభ్రం చేసుకునే పరిస్థితి వచ్చింది.

నిధుల ఖర్చుకు నిబంధనలు ఇవే..

రైతువేదిక నిర్వహణకు ప్రతీ నెల రూ.9వేలు ప్రభుత్వం కేటాయిస్తుంది. ఈ నిధులను ఏఈవో ఖాతాల్లో నాలుగైదు నెలకోసారి ప్రభుత్వం జమచేస్తుంది. ఈ డబ్బులను రైతువేదికల్లో జరిగే సమావేశాలకు కావాల్సిన స్టేషనరీ, టీ, బిస్కెట్లతోపాటు ఇతర అవసరాలకు వినియోగిస్తారు. పరిశుభ్రతకు రూ.3వేలు, శిక్షణకు రూ.2,500, స్టేషనరీకి రూ.వెయ్యి, విద్యుత్ చార్జీలకు రూ.వెయ్యి, మరమ్మతులకు రూ.వెయ్యి, తాగునీటికి రూ.500 ఖర్చు చేసుకునేందుకు నిబంధనలు ఉన్నాయి.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

రైతువేదికల నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం ఆలస్యంగా విడుదల చేసిన పెట్టిన ఖర్చులను రాబట్టుకోవచ్చునన్న ఆశతో వేతనాల్లో నుంచి వెచ్చిస్తున్నారు. ఏకంగా 18 నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో ఏఈవోలు సైతం నిర్వహణను గాలికొదిలేశారు. అధికారుల పనితీరును ప్రభుత్వా లే నిర్వీర్యం చేస్తున్నాయని రైతులు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



రైతువేదికల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి నెల రూ.9వేలు కేటాయించేది. రైతేవేదికలు ప్రారంభించిన ఆరునెలలపాటు ఈ నిధులు వచ్చాయి. 2022 ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు 18 నెలలు నిధులు విడుదల కాలేదు. ప్రతీ జిల్లాస్థాయి సమావేశంలో నిధుల విడుదలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాను. అంతేకాకుండా నివేదికలను కూడా అందజేస్తున్నా. ఇప్పటి వరకు నిధులు విడుదల కాకపోవడంతో ఏఈవోలు వాటి నిర్వహణను భారంగా భావిస్తున్నారు. – భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి, రాజన్న సిరిసిల్ల

సిరిసిల్ల జంట.. సిటీలో మోసాలు

- 'పెళ్లి' పేరిట సంపన్నులకు గాలం
- 12 మంది వద్ద రూ.30 లక్షలు వసూలు
- 'కిలేడీ' జంటను పట్టుకున్న హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు



యెలిగేటి రంజిత్, సంధ్య దంపతులు(ఫైల్)

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు యెలిగేటి రంజిత్ అలియాస్ రాధాకృష్ణ, అలియాస్ రాకేశ్ యెలిగేటి సంధ్య దంపతులు హైదరాబాద్‌లో మోసాలకు పాల్పడిన కేసులో అరెస్ట్ అయ్యారు. వెంకంపేటకు చెందిన రంజిత్, సంధ్య దంపతులు ఆన్‌లైన్‌లో మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లతో సంపన్న కుటుంబాలకు చెందిన అమ్మాయిల ప్రొఫైల్ ద్వారా వివరాలు సేకరించి మోసాలకు పాల్పడ్డారు. నకిలీ పేరుతో పరిచయం పెంచుకుంటూ సేకరించిన వివరాల ఆధారంగా తాను ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తిగా, రియల్ ఎస్టేట్ వ్యాపారిగా నమ్మిస్తూ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో పరిచయమైన అమ్మాయిలతో ప్రేమగా ఉంటూ.. తన భార్య సంధ్యను మేనేజర్‌గా పరిచయం చేశాడు. ఇలా పరిచయం బాగా పెరిగాక.. అమ్మాయి వాళ్ల ఇంటికెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మించి రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో డబ్బులు అత్యవసరం ఉన్నట్లుగా చెప్పి రూ.లక్షల్లో తీసుకున్నాడు. ఇలా మరో కేసులో బాధితుల నుంచి కట్నం పేరిట, గిఫ్ట్‌ల పేరిట రూ.లక్షలు దండుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా.. 12 మంది నుంచి రూ.30లక్షలు వసూలు చేసినట్లు తేలింది. రంజిత్, సంధ్యల నుంచి ఓ కారు, ద్విచక్రవాహనం, పోలీసులు సీజ్ చేసి అరెస్ట్ చేశారు. సిరిసిల్లకు చెందిన కిలేడీ జంట హైదరాబాద్‌లో పెళ్లిళ్ల పేరిట మోసాలకు పాల్పడడం జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది.

శివకల్యాణం ఘనంగా నిర్వహించాలి

- ఆలయ అధికారులతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: ఈనెల 27 నుంచి ఐదు రోజులపాటు రాజన్న క్షేత్రంలో నిర్వహించే శివకల్యాణోత్సవాలకు హాజరయ్యే శివపార్వతులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. చైర్మన్ చాంబర్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శివకల్యాణోత్సవం ఘనంగా నిర్వహించాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా గతంలోకంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు విరివిగా శామియానాలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, హరికిషన్, ప్రతాప నవీన్, జయకుమారి, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈ శేఖర్ పాల్గొన్నారు.

నూతన మాస్టర్‌ప్లాన్ అమలుకు కృషి

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీలో ప్రజలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ ఆమోదానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం 'సాక్షి'లో 'మాస్టర్ ప్లాన్‌కు మోక్షం ఎప్పుడో..' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని కౌన్సిలర్ అనురాధ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నూతన మాస్టర్ ప్లాన్ అమలుకు సీడీఎంఏ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. గ్రీన్ ఇండస్ట్రియల్ జోన్‌లో గృహనిర్మాణ యజమానులకు ఇబ్బంది లేకుండా అనుమతి వచ్చేలా చూస్తామన్నారు.

చెట్టుకు బైక్ ఢీకొని యువకుడి మృతి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): సంతోషంతో పెళ్లి భరాత్‌కు వెళ్తూ ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె శివారులో చోటుచేసుకుంది. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మిడిదొడ్డి పవన్(20) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం బంధువుల పెళ్లి గోపాల్‌రావుపల్లెలో జరగగా.. భరాత్‌లో పాల్గొనేందుకు అర్ధరాత్రి 12:20 గంటలకు స్నేహితులు బండి అఖిల్(16), బత్తిని రాజు(27)తో బైక్‌పై బయలుదేరాడు. తాడూర్ దాటి గోపాల్‌రావుపల్లె మైసమ్మ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. వెంటనే క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మిడిదొడ్డి పవన్ మృతిచెందాడు. బండి అఖిల్, బత్తిని రాజు చికిత్సపొందుతున్నారు. మృతుడు పవన్‌కు తండ్రి బాలరాజు, తల్లి కనకవ్వ, ఇద్దరు అన్నలు ప్రశాంత్, మహేశ్ ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంబారిపేట మహిళకు బ్రెయిన్ డెడ్

- అవయవాలు దానం చేసిన కుటుంబసభ్యులు



రాధ (ఫైల్)



గౌరవ వందనం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కథలాపూర్(వేములవాడ): మండలంలోని అంబారిపేటకు చెందిన గోపు రాధ (38)కు బ్రెయిన్ డెడ్ అయ్యింది. కుటుంబసభ్యులు ఆమె అవయవాలను దానం చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. రాధ నాలుగేళ్లుగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్తూ చికిత్స తీసుకొని, ఇంటి వద్దే ఉండేది. ఈ క్రమంలో ఈ నెల 10న మళ్లీ అనారోగ్యానికి గురవడంతో కుటుంబసభ్యులు ఇంతకుముందు వైద్యం పొందిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా 12వ తేదీ రాత్రి బ్రెయిన్ డెడ్ అయ్యింది. వైద్యులు ఆమె అవయవాలు దానం చేయాలని కుటుంబసభ్యులకు సూచించగా అంగీకరించారు. గురువారం వేకువజాము వరకు రాధను వెంటిలేటర్‌పై ఉంచి, అవయవాలు సేకరించి, ఇతరులకు అమర్చారు. అనంతరం వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది రాధ మృతదేహానికి గౌరవ వందనం చేశారు. మృతురాలి భర్త శ్రీనివాస్ అంబారిపేట మాజీ సర్పంచ్. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

కత్తిపోటుకు గురైన వృద్ధుడు మృతి



నర్సయ్య (ఫైల్)

మల్యాల(చొప్పదండి): మనవరాలిపై దాడి చేసేందుకు వచ్చిన యువకుడిని అడ్డుకొని, కత్తిపోటుకు గురైన ఆనందాస్ నర్సయ్య(65) చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మల్యాల మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన ఓ యువతి పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన బోగ మహేశ్ తనను ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న అతను ఆగ్రహంతో ఈ నెల 4న యువతిని చంపేందుకు కత్తితో ఆమె ఇంటికి వెళ్లాడు. అడ్డుకోబోయిన యువతి తల్లిని గాయపరిచి, తాత నర్సయ్యను పొడిచాడు. బాధితుల ఎదురుదాడిలో మహేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. కత్తిపోటుకు గురైన నర్సయ్యను తొలుత జగిత్యాల ఆస్పత్రికి, అక్కడినుంచి కరీంనగర్ ఆస్పత్రికి తరలించి, శస్త్రచికిత్సలు చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు.

'మసాచుసెట్స్'లో పరిశోధన పత్రం సమర్పణ



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఇర్షద్ అలీ

పెగడపల్లి(ధర్మపురి): ఫుల్ బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అచీవ్‌మెంట్ స్కాలర్‌షిప్ సాధించిన పెగడపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ టీచర్ ఇర్షద్ అలీ యూఎస్ఏలోని మసాచుసెట్స్ వర్సిటీని సందర్శించారు. ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఎక్స్ఛేంజ్ యూఎస్ఏవారు ఇచ్చే స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన ఆయన జెండర్ ఈక్విటీ అనే అంశంపై తన పరిశోధన పత్రాన్ని వర్సిటీలో సమర్పించి, ప్రశంసాపత్రం అందుకున్నారు. అక్కడి మినిట్ మాన్ ఒకేషనల్ కళాశాల, సెకండరీ స్కూల్లో ఇంగ్లిష్ బోధనా పద్ధతులు, విద్యావిధానంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు వివరించానన్నారు. ఇర్షద్ అలీని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

కరెంట్‌షాక్‌తో వన్యప్రాణుల బలి?

- రెండు దుప్పిలతోపాటు వందకుపైగా కోతులు మృతి
- వేటగాళ్లే అమర్చారని ప్రచారం
- గుట్టుచప్పుడు కాకుండా పూడ్చి పెట్టిన వైనం

చందుర్తి: వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు వన్యప్రాణులు బలైన సంఘటన చందుర్తి మండలం రామన్నపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు. రామన్నపేట శివారు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న పంటపొలాల్లో మూడు రోజుల క్రితం వన్యప్రాణుల వేటగాళ్లు విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. విద్యుత్ తీగలకు తగిలి రెండు దుప్పిలతోపాటు వందకు పైగా కోతులు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చనిపోయిన కోతులను అటవీ ప్రాంతంలో ఉపాధిహామీ కూలీలు తీసిన కందకాల్లో పూడ్చివేసినట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికే రామన్నపేటలో నాలుగు నెలల క్రితం పంటపొలంలో విద్యుత్ తీగలు అమర్చడంతో ఓ రైతు గాయపడిన విషయం తెలిసిందే. దీనిపై విద్యుత్ తీగలను అమర్చిన రైతుపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ సంఘటన మరువక ముందే మళ్లీ వేటగాళ్లు విద్యుత్ తీగలను అమర్చి అటవీజంతువులతోపాటు కోతులను బలి తీసుకున్న సంఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల: రానున్న యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. కొనుగోలు కమిటీ సభ్యులతో గురువారం సమావేశమయ్యారు. ఈ యాసంగి జిల్లాలో 1,18,824 హెక్టార్లలో వరి సాగైందని, 5,65,242 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. గ్రేడ్ ఏకు రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 చెల్లిస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా టోకెన్ పద్ధతి పాటించాలన్నారు.

సెక్టోరల్ అధికారుల బాధ్యత విస్తృతమైంది

సెక్టోరల్ అధికారుల బాధ్యత విస్తృతమైందని అదనపు కలెక్టర్ అన్నారు. ఎంపీ ఎన్నికల్లో భాగంగా కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈవీఎంలు, పోలింగ్‌స్టేషన్లపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. సెక్టార్ మ్యాపింగ్, వల్నరేబిలిటి మ్యాపింగ్ కనీస వసతులపై పూర్తి వివరాలతో నివేదిక అందించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ అధికారులతో కమ్యునికేషన్ గ్యాప్‌లేకుండా పోలింగ్‌స్టేషన్లకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి అంశం వదిలిపెట్టకుండా ఎన్నికల నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి ఆనంద్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణానికి చెందిన చాడ సురేశ్ అనే వ్యాపారిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గత ఆదివారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో జరిగిన ఓ సమావేశానికి సురేశ్ హాజరై, బయటకు వచ్చాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన జిందం వంశీ, సామల్ల విజయ్ అకారణంగా ఆయనను దుర్భాషలాడుతూ కొట్టారు. సురేశ్ స్నేహితులు అడ్డుపడగా వారికి చేతిలో ఉన్న బీరుసీసా చూపుతూ చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సహకార సంఘాలతో రైతుల ఆర్థికాభివృద్ధి

కోనరావుపేట(వేములవాడ): సహకార సంఘాలతోనే రైతుల ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని మరిమడ్లలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్మించిన గో దాంహాల్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ప్రారంభించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార బ్యాంకుల్లో ఆన్‌లైన్ సేవలందించడం దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేశామన్నారు. సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, ఎంపీటీసీ రేణుక, నాయకులు రాఘవరెడ్డి, మల్యాల దేవయ్య పాల్గొన్నారు.

గెజిటెడ్ స్టేటస్ సమస్యను పరిష్కరించాలి

జగిత్యాల: వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారుల గెజిటెడ్ స్టేటస్ సమస్యను పరిష్కరించేలా చూడాలని పశుసంవర్ధకశాఖ టీఎన్జీవో అసోయేసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు వినతిపత్రం అందించారు. వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారులు మల్టీజోన్-1, 2 పరిధిలో పనిచేస్తున్నారని, గెజిటెడ్ స్టేటస్ ఫైల్ ప్రభుత్వపరిధిలో ఉందని, దానిని పరిష్కరించేలా చూడాలని కోరారు. అనంతరం పశుసంవర్ధకశాఖ రూపొందించిన డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మహ్మద్ అజాంఖాన్, దైవవీణ సురేఖ, ఎలిగేటి రవీందర్ పాల్గొన్నారు.

ప్రజాభవన్‌ను ముట్టడిస్తాం

- సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలి
- సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కేటీఆర్ కృషి చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని ప్రభుత్వం నివారించే చర్యలు చేపట్టాలని, మూతపడ్డ పరిశ్రమలను తెరిపించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ కోరారు. పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సిరిసిల్లలో 24 గంటల దీక్షలను గురువారం ప్రారంభించారు. అబ్బాస్ మాట్లాడుతూ సిరిసిల్లలో మూడు నెలలుగా వస్త్రోత్పత్తి లేక కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. సిరిసిల్ల నేతన్నల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే నేతన్నలతో ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ సిరిసిల్లలో నేతన్నలు ఉపాధి లేక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. స్థానిక ఎంపీ బండి సంజయ్ నేతన్నల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. 24 గంటల దీక్షల్లో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, కార్మిక నాయకులు నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, ఆడెపు సంపత్, గుండు రమేశ్, మోర తిరుపతి, కంది మల్లేశం, రాము, అంబదాస్, రామచంద్రం కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలకు బీఆర్ఎస్ సంఘీభావం

సిరిసిల్లలో సీఐటీయూ నిర్వహిస్తున్న 24 గంటల దీక్షలకు బీఆర్ఎస్ సంఘీభావం తెలిపింది. ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ వస్త్రపరిశ్రమకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని, వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చి నేతన్నలను ఆదుకోవాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, డయింగ్ యూనియన్ అధ్యక్షుడు జగ్గాని మల్లేశంయాదవ్, కార్మిక నాయకులు వెంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేరొందిన ఇన్సురెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే
ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యంలోనే గత డిసెంబర్ 4న రాత్రే ఎస్ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్ రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్ తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేశాడు. ఎస్ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివి. ద రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరా లను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల
ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌టవెన్, జనరల్ మేనేజర్ కేసన్‌ఫిన్‌లెన్ డెమోస్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు – టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

'కడెం'ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు

- ఖానాపూర్ ఎమ్మెల్యే, వెడ్మ బొజ్జుపటేల్
- ప్రాజెక్టుకు మరమ్మతు పనులు ప్రారంభం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



వరద గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కడెం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలక ప్రాజెక్టు అయిన కడెంను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.5.46 కోట్లు మంజూరు చేసి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతు పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన కడెం ప్రాజెక్టు ఇప్పటికీ చెక్కు చెదరలేదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిందని అన్నారు. ప్రాజెక్టు నిర్వహణను కూడా బీఆర్ఎస్ సర్కార్ గాలికి వదిలేసిందని ఆరోపించారు. దీని ఫలితంగా ప్రాజెక్టు ఆయకట్టు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రాజెక్టు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కడెం ఆయకట్టు రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కడెం ఎగువన కుప్టి ప్రాజెక్టు నిర్మాణం, 25 గేట్లతో కడెం ప్రాజెక్టు పునర్నిర్మాణం అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అలెగ్జాండర్, ఈఈ విఠల్, డీఈ బోజదాసు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని, మండలాధ్యక్షుడు మల్లేశ్, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, భూమేశ్, వెంకటేశ్, సాగర్, సత్తెన్న, రఫీక్, సత్యంచారి, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

చెట్లపొదల్లో నవజాత శిశువు

- ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని శివారులో ఘటన
- శిశుగృహకు తరలించిన అధికారులు




పంటచేనులో శిశువు



శిశుగృహ సిబ్బందికి అప్పగిస్తున్న అధికారులు

తాంసి: నవజాత శిశువును ఎవరో పంటచేనులో వదిలివెళ్లిన అమానవీయ ఘటన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం వేకువజామున 5గంటలకు నిపాని గ్రామానికి చెందిన గంగమ్మ సమీపంలోని పంటచేను వద్దకు బహిర్భూమికి వెళ్లగా పసికందు ఏడుపు వినిపించింది. వెంటనే ఆమె పొదల్లో పడి ఉన్న మగశిశువును గుర్తించింది. ఆమె సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న గ్రామస్తులు శిశువును అక్కున చేర్చుకున్నారు. గ్రామంలోకి తీసుకువెళ్లి స్నానం చేయించి పాలు పట్టారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ప్రదీప్‌కుమార్ గ్రామానికి చేరుకున్నారు. శిశువును మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం అంబులెన్స్‌లో తరలించి శిశుగృహ అధికారులకు అప్పగించారు. కాగా, మహారాష్ట్ర నుంచి అంతర్రాష్ట్ర రహదారిపై వెళ్లేవారెవరైనా శిశువును వదిలి వెళ్లి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. కాగా, శిశువు లభించిన స్థానంలో మహిళ ప్రసవించిన ఆనవాళ్లు ఉన్నాయి.

జీడీకే-5 ఓసీపీకి మరో 30 ఏళ్ల భవిష్యత్!



జీడీకే-5 ఓసీపీ



బెల్ట్‌ద్వారా బయటకు వస్తున్న బొగ్గు

- పంచ్‌ఎంట్రీ తరహాలో ఓసీపీ
- ప్రస్తుత ఓసీపీకి తగ్గిన జీవితకాలం
- ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న యాజమాన్యం

ప్రతిపాదిత ప్రాజెక్టు పేరు: పంచ్‌ఎంట్రీ
టెక్నాలజీ : కంటిన్యూస్ మైనర్
జీవితకాలం: సుమారు 30 ఏళ్లు
బొగ్గు నిల్వలు: 40 మిలియన్ టన్నులు
ఏటా ఉత్పత్తి: ఒక మిలియన్ టన్ను
అంచనా వ్యయం: రూ.150 కోట్లు

గోదావరిఖని(రామగుండం): జిల్లాలో బొగ్గునిల్వలు అడుగంటిపోతున్నాయి. ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ వెళ్తున్న యాజమాన్యం దానికి తగ్గట్టుగా విస్తరణ లేకపోవడంతో గనుల మూసివేతకు దారి తీస్తోంది. ఇటీవలే గోదావరిఖని సమీపంలో ఏర్పాటైన జీడీకే-5ఓసీపీ పరిస్థితి అలాగే తయారైంది. మరో 8ఏళ్లలో బొగ్గు నిల్వలు పూర్తయి కాలగర్భంలో కలిసిపోనుంది. వాస్తవానికి 14ఏళ్ల జీవిత కాలం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఏటా వార్షిక లక్ష్యాలు పెంచుకుంటూ వెళ్తుండటంతో బొగ్గు నిల్వలు అడుగంటిపోతున్నాయి. నాలుగేళ్ల ముందుగానే ఈ ప్రాజెక్టులో బొగ్గు నిల్వలు పూర్తికానున్నాయి. ఈక్రమంలో ఈప్రాంతంలో బొగ్గుగని జీవితకాలం పెంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జీడీకే-5 ఓసీపీ క్వారీలో 300 మీటర్ల లోతులో పంచ్‌ఎంట్రీ ఏర్పాటు చేసి 600 మీటర్ల లోతు వరకు ఉన్న బొగ్గును వెలికితీసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తరహాలో భూమిపొరల్లో ఉన్న బొగ్గును వెలికితీయడం ప్రారంభిస్తే జీడీకే-5 ఓసీపీకి మరో 30ఏళ్ల భవిష్యత్ ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిదేళ్ల జీవిత కాలంతో పాటు మరో 30 ఏళ్లు కలిస్తే 38 ఏళ్లపాటు ఈ ప్రాజెక్టు ఢోకా ఉండబోదని నిపుణులు చెబుతున్నారు.

డిమాండ్ పెరగడంతో..

గోదావరిఖని సమీపంలో 14ఏళ్ల జీవిత కాలం లక్ష్యంగా జీడీకే-5 ఓసీపీని భూగర్భగనుల స్థానంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రతిపాదనలు రూపొందించిన సమయంలో ఉత్పత్తి లక్ష్యం తక్కువగా కేటాయించినప్పటికీ విద్యుత్‌సంస్థల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో వార్షిక లక్ష్యాలను అనూహ్యంగా పెంచారు. దీంతో జీవిత కాలం పదేళ్లకే పరిమితం అయ్యింది. ఆ తర్వాత ఓసీపీ మూసివేసే పరిస్థితి ఏర్పడింది.

పంచ్‌ఎంట్రీ పేరుతో కొత్త గని

అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తరహాలో పంచ్ ఎంట్రీ ద్వారా భూగర్భగని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు మొదలయ్యాయి. ఓసీపీ లోపల 300 మీటర్ల లోతులో ఐదు సొరంగాలు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 600మీటర్ల లోతువరకు బొగ్గును వెలికితీయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇది ఆచరణ రూపం దాల్చితే మరో 30ఏళ్ల భవిష్యత్ పెరగనుంది. ప్రాథమికంగా దీనిపై నివేదికలు ఉన్నతస్థాయికి వెళ్లినట్లు తెలుస్తోంది. రామగుండం రీజియన్‌లో భూగర్భగనులు రోజురోజుకు తగ్గిపోతుండటం, పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు తగ్గుతున్న క్రమంలో యాజమాన్యం తీసుకునే ఈనిర్ణయంతో మరో 30 ఏళ్ల భవిష్యత్ ఉండనుంది.

రిమ్స్‌లో ముక్కు మూసుకోవాల్సిందే..











ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పలు వార్డుల్లో చెత్తాచెదారం రోజుల తరబడి పేరుకుపోతోంది. పైగా ఆస్పత్రికి వచ్చే రోగులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నేడు 'షరతులు వర్తిస్తాయి' విడుదల

- సినిమా దర్శకుడు గోదావరిఖనివాసి





సినిమా పోస్టర్, చిత్ర నటులతో దర్శకుడు కుమారస్వామి (మధ్యలో)

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ యాస, భాష ఎంచుకొని, మధ్యతరగతి మనుషుల జీవితాలను, తాను పడిన, చూసిన కష్టనష్టాలను, సంతోషాలను ఇతివృత్తంగా గోదావరిఖనికి చెందిన రచయిత, దర్శకుడు కుమారస్వామి(అక్షరకుమార్) స్టార్ లైట్ స్టూడియో బ్యానర్‌లో 'షరతులు వర్తిసాయి' అనే చిత్రాన్ని తెరకెక్కించాడు. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. చిత్రీకరణ హీరో, హీరోయిన్‌ల ఇళ్లున్న కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో, చల్మెడ ఆనందరావు ఆస్పత్రి, ఎల్ఎండీ కాలనీ, శుభమంగళ ఫంక్షన్‌హాల్, వివేకానంద హైస్కూల్, భాగవతి స్కూల్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో జరిగింది. ఇది ఆద్యంతం విజ్ఞానం, వినోదం పంచే సినిమాగా నిలుస్తుందని చిత్ర యూనిట్ తెలిపింది.

మంచి సినిమా.. ఆదరించండి

కరీంనగర్ ఎన్నో ఉద్యమాలకు, త్యాగాలకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. షరతులు వర్తిస్తాయి సినిమా మీ సమాయాన్ని, డబ్బును వృథా చేయదు. ఇది సామాన్యుల బతుకు చిత్రం. మంచి సినిమా.. ప్రేక్షకులు ఆదరించాలి. తెలంగాణ సినిమాను నిలబెట్టాలి.

– కుమారస్వామి, రచయిత, దర్శకుడు

వృద్ధురాలి ఆభరణాలు చోరీ

కరీంనగర్ క్రైం: మాయమాటలు చెప్పి, గుర్తు తెలియని వ్యక్తులు ఓ వృద్ధురాలి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కరీంనగర్ టూ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని సప్తగిరికాలనీకి చెందిన గంగిపెల్లి బాలయ్య మంకమ్మతోటలో ఇస్త్రీ షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం ఆయనకు భోజనం ఇవ్వడానికి భార్య శంకరమ్మ వెళ్తోంది. దారిలో ఇద్దరు యువకులు కలిసి.. పోలీసులు తనిఖీ చేసి, బంగారం తీసుకుంటున్నారని, తమకు ఇస్తే వారిని దాటగానే ఇచ్చేస్తామని నమ్మించారు. దీంతో ఆమె తన వద్ద ఉన్న రూ.90 వేల విలువైన పుస్తెలతాడు, ఉంగరం ఇచ్చేసింది. వారు వెంటనే బైక్‌పై పారిపోయారు. తర్వాత దొంగలని గుర్తించిన శంకరమ్మ అరవడంతో స్థానికులు వచ్చి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ కనిపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.